
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

యాదాద్రి భువనగిరి

5

గురువారం 29 మే 2025



చికెన్ ధరలు	
లైవ్	150
డ్రెస్	230
స్కిన్‌లెస్	260
గుడ్డు డజన్	72
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	36.5
కనిష్ఠం	23.0

కలిసొచ్చిన కాలం..

మొలకెత్తిన విత్తనం

ఒకట్రెండు వర్షాలకు విత్తనాలు విత్తరు. ఒక వేళ విత్తితే ఎండలకు విత్తనాలు మొలకెత్తకుండా భూమిలోనే వట్టిపోతాయి. కానీ ఈసారి కత్తెర చివరి పాదం నుంచి రోహిణిలో కూడా వర్షాలు కురుస్తుండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. (ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

7

స్థానిక పోరుకు సన్నాహాలు



స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జూన్ నెలలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని అన్ని పార్టీలు భావిస్తున్నాయి. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం, సాగునీటి కాల్వల పునరుద్ధరణ, రాజీవ్‌ఆరోగ్యశ్రీ, భూభారతి వంటి పథకాలు ప్రవేశపెట్టింది. ఈ పథకాలతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని కాంగ్రెస్ యోచిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎప్పుడైనా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందని అన్ని పార్టీలు ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయి.

● ఆంధ్రజ్యోతి, యాదాద్రి

- జూన్‌లో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం
- ప్రభుత్వంలో కదలికతో రాజుకుంటున్న రాజకీయ సెగ
- రానున్న ఎన్నికలే లక్ష్యంగా అడుగులు వేస్తున్న పార్టీలు
- సత్తా చాటాలని అధికార, ప్రతిపక్షాల కసరత్తు

స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో నిర్వహించే అవకాశం ఉండటంతో అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఇప్పటికే గ్రామాల బాటపట్టారు. గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలతోపాటు తాత్కాలికంగా చేపట్టే పనులపై ఆరా తీస్తున్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు సూచిస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ యోచిస్తోంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ప్రతిపక్షాలు సైతం అధికార పక్షం ఇచ్చిన హామీలపై ప్రత్యేక దృష్టి సారించి, విమర్శలతో హోరెత్తిస్తోంది. ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. అధికార, విపక్షాలు స్థానిక ఎన్నికల సమరానికి సై అంటుండటంతో గ్రామాలు, పట్టణాల్లో రాజకీయ సెగ మెల్లగా రాజుకుంటోంది.

ఎన్నికలకు సిద్ధం

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల సంఘం వేగం పెంచింది. తుది ఓటర్ల జాబితా సిద్ధం చేసిన అధికారులు, మిగిలిన పనుల్లో వేగం పెంచారు. జిల్లాల వారీగా బ్యాలెట్ బాక్సులకు మరమ్మతులు చేపట్టారు. ఎన్నికలకు అవసరమైన సామగ్రి జిల్లాలకు చేరుతోంది. షెడ్యూల్ విడుదల కాగానే ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. ఇప్పటికే సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ ఎన్నికల సిబ్బందికి శిక్షణకు సంబంధించిన మాడ్యూల్స్, ప్రిసైడింగ్, రిటర్నింగ్ అధికారుల హ్యాండ్ బుక్స్ జిల్లాలకు చేరాయి. ఎన్నికల సామగ్రి విడతల వారీగా చేరుతోంది. రెండు నెలల్లోగా స్థానిక ఎన్నికలు పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్టు సమాచారం. జిల్లాలో 428 పంచాయతీల్లో 5,20,297మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 2,59,167మంది, మహిళలు 2,61,127మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారు. ఓటరు తుదిజాబితా సిద్ధమైంది. ప్రభుత్వం నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల వివరాలు అందిన వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 1-200 మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారితో పాటు మరో పోలింగ్ అధికారి ఉంటారు. 201నుంచి 400 మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401నుంచి 650మంది ఓటర్ల వరకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమిస్తారు. ఒక్కో గ్రామపంచాయతీలో వార్డుల వారీగా ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులను నియమించాలి. ప్రతీ వార్డులో కనీసం ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి. ఒక వార్డులో 650మంది ఓటర్లు ఉన్న చోట రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయాలి. ఈ మేరకు జిల్లాయంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

సామాజిక న్యాయం పాటించాలని

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని, అధిష్ఠానం నియమించిన అభ్యర్థులను పార్టీ నాయకులు, కార్యకర్తలు గెలిపించుకోవాలని కాంగ్రెస్ ఆ పార్టీ నేతలకు సూచించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ అన్ని జిల్లాల్లోని ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల అంశంలో సామాజిక న్యాయం పాటించాలని, ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా ఉండేలా నిర్ణయాలు తీసుకోవాలని సూచించినట్టు సమాచారం. ప్రభుత్వం ఇటీవల తీసుకున్న బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కల్పనపై కసరత్తు చేయాలని సూచించినట్టు తెలిసింది. ప్రజల్లో మంచి పేరున్న

మిగతా 8వ పేజీలో...

ఆర్థిక భరోసాకే మొగ్గు

- జూన్ 2న రాజీవ్ యువ వికాసం ప్రొసీడింగ్స్ అందజేత
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క





కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న భట్టి విక్రమార్క, చిత్రంలో పొన్నం ప్రభాకర్

భువనగిరి (కలెక్టరేట్), మే 28 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా ఆర్థిక భరోసా ఇచ్చే యూనిట్లకు మొగ్గు చూపాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాజీవ్ యువ వికాస పథకం అమలుపై బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎస్ రామకృష్ణారావుతో కలిసి ఆయన హైదరాబాద్ సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పథకం అమలుకు జిల్లాలో తీసుకున్న చర్యలను కలెక్టర్ హనుమంతరావు వివరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పథకాలను కార్పొరేషన్ ద్వారా మొక్కుబడిగా అమలు చేశాయని, లక్షలాది యువతకు స్వయం ఉపాధే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకం అమలు చేస్తోందని అన్నారు. 5లక్షల మంది యువత ఉపాధికి ప్రభుత్వం నడుం బిగించిందన్నారు. క్షేత్రస్థాయిలో ఆయా జిల్లాల కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించి పథకం అమలులో క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. జూన్ 2న లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తామని, గ్రౌండింగ్ అయిన యూనిట్ల పర్యవేక్షణకు జిల్లాలో కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాస పథకం నిరంతరాయంగా కొనసాగే ప్రక్రియ అని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ యువత ప్రభుత్వం అందించే సహాయంతో ఉపాధి పొంది ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో శోభారాణి, ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, డీఆర్డీవో నాగిరెడ్డి, ఎస్సీ, బీసీ సంక్షేమాధికారులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఈజీఎస్, స్వచ్ఛభారత్ మిషన్

● పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్ సృజన



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సృజన

భువనగిరి (కలెక్టరేట్), మే 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం, స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమాలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్ సృజన అన్నారు. ఈజీఎస్, స్వచ్ఛభారత్ మిషన్‌పై ఆమె బుధవారం కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈజీఎస్, స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమాలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఉపాధిహామీ పథకంలో సగటున చెల్లిస్తున్న వేతనాలు, సమయానికి అందుతున్నాయో? లేదో? అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే ప్రారంభమైన పనుల పురోగతిని ఆరా తీసి వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో జడ్పీ సీఈవో ఎన్. శోభారాణి, డీఆర్డీవో నాగిరెడ్డి, డీపీవో సునంద, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి రూరల్, మే28(ఆంధ్రజ్యోతి): చివరి ధాన్యపు గింజ వరకూ కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెంద వద్దని అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బాలంపల్లి, పచ్చర్లబోడు తండాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన ధాన్యాన్ని తెచ్చి మద్దతు ధర పొందాలన్నారు. దళారులను ఆశ్రయించకుండా ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకోవాలన్నారు. అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం రాశులపై ప్లాస్టిక్ కవర్లు కప్పి ఉంచుకోవాలన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంట వెంటనే రైస్ మిల్లులకు తరలించే విధంగా నిర్వాహకులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సైదా సాహెబ్, బలరాం, ఐకేపీ ఏపీఎం అంజయ్య పాల్గొన్నారు.

'పోచంపల్లి ఇక్కత్ చరిత్ర' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్, సంఘం నాయకులు

భూదాన్‌పోచంపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ చేనేత పరిశోధకుడు, నిజాం కాలేజీ ప్రొఫెసర్ తడక యాదగిరి రచించిన 'పోచంపల్లి ఇక్కత్ చరిత్ర' పుస్తకాన్ని బుధవారం భూదాన్‌పోచంపల్లిలోని చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా చేనేత, జౌళీ శాఖ ఏడీ శ్రీనివాస్‌రావు హాజరై మాట్లాడారు. పోచంపల్లి ఇక్కత్ చరిత్ర, పోచంపల్లి చారిత్రక నేపథ్యం, టూరిజం అభివృద్ధితోపాటు పోచంపల్లి ఇక్కత్ డూప్లికేషన్ తదితర అంశాలు ఈ పుస్తకంలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, పోచంపల్లి అర్బన్ బ్యాంకు చైర్మన్ తడ్క రమేష్, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కర్నాటి బాలరాజు, సిల్కు యారన్ అధ్యక్షుడు రవీందర్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

రామన్నపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న ధ్యాస స్థానిక ఎన్నికలపై ఎందుకు లేదని, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. సీపీఎం మండల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసి సంవత్సరంనర గడుస్తున్నా ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యుడు బల్గురి అంజయ్య, బోయిని ఆనంద్, కందుల హనుమంతు, కల్లూరి నరేష్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్

● స్టాక్, బిల్ వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి ● వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యం ● కలెక్టర్ ఎం.హనుమంతరావు



వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, అధికారులు

భువనగిరి (కలెక్టరేట్), మే 28 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఎం.హనుమంతరావు హెచ్చరించారు. కలెక్టరేట్‌లో బుధవారం వ్యవసాయ అధికారులు, జిల్లాలోని విత్తన, ఎరువుల డీలర్లు, ఏఈవోలతో జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖలపై జరిగిన సమీక్షలో అదనపు కలెక్టర్ జీ. వీరారెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని, వానాకాలం సీజన్‌లో రైతులను మోసం చేయడానికి ప్రయత్నిస్తే సహించేది లేదన్నారు. ఫర్టిలైజర్స్ షాపుల యజమానులు లైసెన్స్, స్టాక్ రిజిస్టర్, బిల్ రిజిస్టర్, డీఏపీ, యూరియా ఇతర పురుగుల మందులు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీలు నిరంతరం పర్యవేక్షిస్తాయని, నకిలీ విత్తనాలపై మండల వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. జిల్లాలో విత్తనాల కొరత లేదని, కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు విత్తన ప్యాకెట్లను పంట కాలం పూర్తయ్యే వరకూ భద్ర పరుచుకోవాలన్నారు. అనంతరం ఈపాస్ మిషన్లను డీలర్లకు అందజేసి ఆయిల్‌పామ్ సాగు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, ఉద్యాన శాఖాధికారి సుభాషిణి, ఏడీఏ నీలిమ, అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణ వేడుకలకు ఏర్పాట్లు

రాష్ట్ర అవతరణ దినోత్సవం (జూన్ 2) వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఎం. హనుమంతరావు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అవతరణ వేడుకలపై అన్ని శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షించారు. సమావేశంలో అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, డీఆర్‌డీవో నాగిరెడ్డి, కలెక్టరేట్ ఏవో జగన్మోహన్ ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదం

ఆర్థిక రుణ ప్రణాళిక-2025-26లో జిల్లాలో అధిక ప్రాధాన్యం వ్యవసాయ రంగానిదే అని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన బ్యాంకర్ల సమావేశంలో వార్షిక ప్రణాళికను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మొత్తం రూ.6,660.15 కోట్ల అంచనాతో రూపకల్పన చేసినట్లు తెలిపారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపు, సూక్ష్మ పరిశ్రమల వృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఈ ప్రణాళిక దోహదపడనుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో నాగిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, బీసీ సంక్షేమాధికారి యాదయ్య, రవీందర్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

నృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

● వైభవంగా సువర్ణ పుష్పాలంకరణ



ప్రత్యేక అలంకారంలో ఉత్సవమూర్తులు

యాదగిరీశుడి క్షేత్రంలో నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామి, అమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకరించి తులసీదళాలతో సహస్రనా ర్చనలు నిర్వహించారు. విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు.

7 (ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట)

మానవ అక్రమ రవాణా అతిపెద్ద నేరం

● అక్రమ రవాణాపై టోల్ ఫ్రీ నెం.1930కు సమాచారం ఇవ్వాలి ● డీఈవో సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సత్యనారాయణ

భువనగిరి టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా అతి పెద్ద నేరమని డీఈవో కే.సత్యనారాయణ అన్నారు. భువనగిరిలో బుధవారం నిర్వహించిన మానవ అక్రమ రవాణా నియంత్రణ సదస్సులో ఆయన మాట్లాడారు. అక్రమ రవాణాకు గురవుతున్న వారిలో మహిళలు, పిల్లలే అధికంగా ఉన్నారన్నారు. అక్రమ రవాణాతో వ్యభిచారం వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారని, పిల్లల శ్రమ దోపిడి, అవయవాల విక్రయానికి పాల్పడుతున్నారన్నారు. మహిళా శిశు సంక్షేమ, పోలీస్ శాఖలు అక్రమ రవాణా నియంత్రణకు పని చేస్తున్నాయని, పాఠశాలలోనూ అక్రమ రవాణాపై ఉపాధ్యాయులు పిల్లలకు అవగాహన కల్పించాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. అక్రమ రవాణాపై టోల్‌ఫ్రీ నెం.1930కు సమాచారం ఇవ్వాలన్నారు. సదస్సులో జిల్లా విద్యాశాఖ అధికారులు శ్రీనివాసచారి, దుర్గాప్రసాద్, మంజరి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంచార జాతుల సంక్షేమానికి పెద్దపీట

● బీసీ సంక్షేమ శాఖ అధికారి యాదయ్య



సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య

భువనగిరి రూరల్, మే28(ఆంధ్రజ్యోతి): సంచార జాతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధికారి యాదయ్య అన్నారు. బుధవారం మండలంలోని తాజ్‌పూర్ గ్రామంలో సంచార జాతుల మహిళా సంక్షేమ సంఘం, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంచార జాతులకు ప్రత్యేక రుణాలు అందజేయడంతోపాటు వారి పిల్లలకు వసతి గృహాల్లో సీట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎంబీసీ కార్పొరేషన్ నుంచి రూ.10లక్షల రుణాన్ని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నరేందర్, కోట అనిత, మంగమ్మ, నాగేశ్వర్ రావు, వెంకటేశ్, గోవర్ధన్, గంగాధర్, నర్సింహ పాల్గొన్నారు.



పోచంపల్లిలో

ఆఫ్రికన్ ప్రతినిధులు

- ఇక్కత్ వస్త్రాను చూసి ఆనందం
- చేనేత కళను అభినందించిన వైనం

7

నిర్వాసితులకు పరిహారం అందజేస్తాం

● భువనగిరి తహసీల్దార్ ఎన్.అంజిరెడ్డి



బీయన్‌తిమ్మాపూర్ ముంపు నిర్వాసితులకు నోటీసులు అందజేస్తున్న తహసీల్దార్ అంజిరెడ్డి

భువనగిరి రూరల్, మే28(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల్లో భాగంగా బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న బీయన్ తిమ్మాపూర్ నిర్వాసితులకు పరిహారం అందజేస్తామని భువనగిరి తహసీల్దార్ ఎన్.అంజిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బీయన్ తిమ్మాపూర్‌లో ముంపునకు గురవుతున్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి నిర్వాసితులతో ఆయన సమావేశం ఏర్పాటుచేశారు. గ్రామంలో సుమారు 800 పైచిలుకు ఇంటి నిర్మాణాలు ముంపునకు గురవుతున్నాయని, వారందరికీ పరిహారం అందిస్తామన్నారు. అయితే మొదటగా రూ.12లక్షలలోపు విలువైన ఇళ్లకు పరిహారం ఇస్తామన్నారు. సంబంధిత నిర్వాసితులు బ్యాంకు ఖాతాలు, ఆధార్ కార్డు జీరాక్స్ పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. ముంపు నిర్వాసితులందరికీ విడతలవారీగా పరిహారాన్ని పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు ఉడుత శారద ఆంజనేయులు, జిన్న మల్లేశ్, ఎడ్ల దర్శన్ రెడ్డి, రెవెన్యూ అధికారి నవనీత, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాగుపై రైతులకు సలహాలు : ఏడీఏ శాంతి



వంగపల్లిలో సామగ్రిని పరిశీలిస్తున్న ఏడీఏ శాంతి

యాదగిరిగుట్ట రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట వ్యవసాయ డివిజన్ పరిధిలో రైతు వేదికల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సాగుపై రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు ఏడీఏ శాంతి నిర్మల తెలిపారు. బుధవారం మండలంలోని వంగపల్లి, సైదాపురం గ్రామాల్లో రైతువేదికలో నూతనంగా వచ్చిన వీడియో సామగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆమె వెంట ఏఏవో సుధారాణి ఉన్నారు.


కులవృత్తులకు ఒకప్పుడు ఎంతో ఆదరణ ఉండేది. ఎంతోమంది కులవృత్తులపై ఆధారపడి ఉపాధి పొందుతూ కుటుంబాలను పోషించుకునేవారు. అందుకే కులవృత్తి మానకురా గువ్వల చెన్నా అన్నది ఒకప్పటి నానుడి. రానురాను మారుతున్న కాలనుగుణంగా కులవృత్తులకు ఆదరణ కరువైంది. ప్రధానంగా ఏ కార్యమైనా ఉపయోగించే కుండల తయారు చేసే కుమ్మరుల పరిస్థితి ఇబ్బంది మారింది. రేడిమెడ్, ప్లాస్టిక్ వస్తువులు మార్కెట్లను ముంచెత్తుతుండటంతో చేతిపై తయారు చేసే వస్తువులకు గిరాకీ తగ్గింది. దీంతో ఉపాధి లేక పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

(ఆంధ్రజ్యోతి-రాజాపేట)

గిరాకేదీ గువ్వలచెన్నా?

● మట్టిపాత్రలకు తగ్గిన డిమాండ్ ● మార్కెట్‌ను ముంచెత్తుతున్న స్టీల్, ప్లాస్టిక్ వస్తువులు ● ఉపాధి కోసం కులవృత్తికి స్వస్తి చెబుతున్న కుమ్మరులు





ఆదరణ కరువై కులవృత్తులు చేసేవారు ఇతర ఉపాధి మార్గాల వైపు మళ్లుతున్నారు. అనాదిగా వస్తున్న చేతివృత్తికి స్వస్తిపలుకుతున్నారు. శుభ, అశుభ కార్యమైనా ముందుగా వాడేది మట్టి పాత్రలు. ఆ పాత్రలు తయారు చేసే కుమ్మరుల పరిస్థితి నేడు ఆగమ్యగోచరంగా మారింది. యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలో 200 వందలకు పైగా కుటుంబాలు ఉండగా 1000కి పైగా జనాభా ఉంది. కులవృత్తినే ఆధారంగా చేసుకుని జీవిస్తున్న 25 కుటుంబాలు ఉన్నాయి. మండలంలోని చల్లూరు, బొందుగుల, పాంకుంట, సింగారం, పారుపల్లి గ్రామాల్లో కొంతమంది కులవృత్తిని కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా మట్టితో సారెపై వివిధ రకాల మట్టిపాత్రలను తయారుచేస్తున్నారు. ఆయా పాత్రల తయారీకి వినియోగించే నల్ల మెత్తటిమట్టి కొంతకాలంగా చెరువులు నిండకపోవటంతో స్థానికంగా లభించడంలేదు. దీంతో 20 కిలోమీటర్ల దూరంలోని సిద్దిపేట జిల్లా నాగపురి గ్రామంలోని చెరువుల నుంచి ట్రాక్టర్ల ద్వారా తెచ్చుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది.

ఐదు దశాబ్దాలుగా వృత్తిలో...



రాజాపేట మండలం సింగారం గ్రామానికి చెందిన బోనాల వెంకటయ్య వయస్సు 70 ఏళ్లు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు. వారికి కల వృత్తే ఆధారం. తాను 17 ఏళ్ల వయస్సు ఉన్నప్పటి నుంచి కుల వృత్తిని చేపట్టారు. వయస్సు మీద పడినా వృత్తిని మాత్రం విడవలేదు. సారెపై మట్టిపాత్రలను తయారుచేస్తున్నారు.రోజంతా కష్టపడిన కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదు. తయారుచేసిన మట్టి పాత్రలకు గిరాకీ లేకపోవడంతో జీవనం ఇబ్బందిగా మారింది. కుమ్మరులకు ప్రభుత్వం ఆసరా కల్పించి ఆదుకోవాలని ఆయన కోరారు.

కుటుంబ సభ్యులతో కలిసి

ఒండ్రుమట్టిని ఎండలో ఆరబోసి బాగా చూర్ణం చేసి నీటితో తడిసి ఒక రోజు మక్కబెడతారు. ఆ తర్వాత రోజు మట్టిని మెత్తగా అయ్యే వరకూ ఉదయం తొక్కుతారు. ఇందులో ఇంట్లో సభ్యులందరూ పాల్గొంటారు. మెత్తగా తయారు చేసుకున్న మట్టిని సారెపై పెట్టి పాత్రలను తయారు చేస్తుంటారు. ఆ మెత్తటి పాత్రలను సల్పతో నున్నగా తీర్చిదిద్దుతారు. అనంతరం ఈ పాత్రలను నీడలో కొద్దిరోజులు, ఎండలో కొద్దిరోజులు ఆరబెట్టి వాములో కాల్చుతారు. ఆ తర్వాత మట్టిపాత్రలు పూర్తిస్థాయిలో వినియోగానికి తయారవుతాయి.

వివిధ రకాల ఆకృతిలో

కుమ్మరులు మట్టితో వివిధ రకాల ఆకృతిలో వస్తువులను తయారు చేస్తుంటారు. కుండలు, కంచులు, గురుగులు, దీపపు ప్రమిదలు, వండే పాత్రలను తయారుచేస్తున్నారు. అయితే వాటిని విక్రయించడం కుమ్మరులకు ఇబ్బందిగా మారింది. రెడీమెడ్, ప్లాస్టిక్ వస్తువులు, అల్యూమినియం, స్టీల్ పాత్రలు మార్కెట్‌లోకి రావడంతో మట్టితో తయారుచేసిన పాత్రలకు గిరాకీ లేకుండాపోయింది. పండుగలు, జాతర్లు, శుభ, అశుభ కార్యాలకు మాత్రమే కొనుగోళ్లు చేస్తున్నట్లు కుమ్మరులు తెలిపారు. మిగతా రోజుల్లో పెద్దగా గిరాకీ ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి కరువై చేతి వృత్తిని వదిలి ఇతర వృత్తుల్లోకి వెళ్తున్న తరుణంలో కుమ్మరులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. మట్టితో చేసిన వస్తువులు విక్రయించేందుకు ఏర్పాట్లు చేయాలని, అందుకు తగ్గ చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని రాజాపేట మండల కుమ్మరి సంఘం నాయకులు కోరారు.

ప్రభుత్వం సాయం చేయాలి



కుల వృత్తిపై ఆధారపడిన కుమ్మరుల పరిస్థితి అధ్వానంగా మారింది. నేడు ప్రజల నుంచి ఆదరణ కరువైంది. చేతి వృత్తులకు ఆసరా కల్పించేందుకు ఆధునిక యంత్రాలను అందించాలి. బ్యాంకుల ద్వారా రుణాలను ఇప్పించి ప్రోత్సహించాలి.

బోనాల వెంకటేష్, కుమ్మరి సంఘం అధ్యక్షులు, రాజాపేట మండలం

కులవృత్తులను కాపాడాలి



కులవృత్తులను ప్రభుత్వ కాపాడాలి. కుమ్మరులు అనాదిగా కులవృత్తినే ఆధారంగా చేసుకుని చాలీచాలని జీవితాలను వెళ్లదీస్తున్నారు. ఉపాధి లేక ఇతర వృత్తులకు మారుతున్నారు. ఇంటిల్లిపాది కష్టపడినా కూలీ గిట్టడంలేదు. కుమ్మరులకు తగిన ప్రోత్సాహాన్ని ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.

చెలిమెళ్లపల్లి లక్ష్మణ్, కుమ్మరి సంఘం నాయకులు, రాజాపేట

అప్పుల బాధతో రైతు బలవన్మరణం



రఘుపతి(ఫైల్)

వలిగొండ, మే 28 (ఆంధ్రజ్యోతి): దిగుబడి రాక, చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వలిగొండ మండలం గురునాథ్‌పల్లి గ్రామానికి చెందిన పంతుల రఘుపతి (42) తనకున్న మూడు ఎకరాలతో పాటు, మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. దిగుబడి ఆశించినంత మేర రాక, సాగుకు చేసిన రూ.6లక్షలకు పైగా అప్పులు తీర్చలేక కొద్ది రోజులుగా మానోవేదనకు లోనవుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ నెల 24వ తేదీన సాయంత్రం క్రిమిసంహారక మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అదే రోజు సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. రఘుపతి భార్య లలిత బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. రఘుపతికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి



తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందిన వెంకన్న

మద్దిరాల, మే 28 (ఆంధ్రజ్యోతి) : తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం పోలుమళ్ల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన తునికి వెంకన్నగౌడ్(55) బుధవారం ఉదయం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా జారి కింద పడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య తునికి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. వెంకన్నగౌడ్‌కు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పంచాయతీ కార్యదర్శి మహేష్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సొసైటీ కార్మికులు రేసు లింగయ్య, లింగరాజు, జగన్, రేసు వెంకన్న, మమూనూరి రామయ్య, ఆకుల రమేష్, తాళ్లపల్లి మల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు.

గొర్లకాపరిని అకారణంగా కొట్టిన కానిస్టేబుల్



విలేకర్లతో మాట్లాడుతున్న ప్రవీణ్ తలిదండ్రులు

ఆత్మకూరు(ఎం), మే 28 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలకేంద్రానికి చెందిన ఓ గొర్రెల కాపరిని స్థానిక కానిస్టేబుల్ తీవ్రంగా కొట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బుధవారం బాధితుడు, అతడి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రానికి చెందిన మజ్జిగ విజయ, ఆమె కుమారుడు మజ్జిగ ప్రవీణ్(15) కలిసి ఈ నెల 26న నారాయణబావి ప్రాంతంలో గొర్రెలను మేపుతున్నారు. మధ్యాహ్నం దాహం వేయగా ప్రవీణ్ మంచినీటి కోసమని దగ్గరలోని రైతు వ్యవసాయ బావి బోరు మోటారు ఆన్ చేసి నీళ్లు తాగాడు. అదేవిధంగా తన వెంట తెచ్చిన బాటిల్ నింపుకొని మోటార్ నిలిపివేసి తల్లి దగ్గరకు వెళ్తున్నాడు. అదే సమయంలో అక్కడకు వచ్చిన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న లింగంనాయక్ అనే కానిస్టేబుల్ ప్రవీణ్‌ను అడ్డుకుని మోటారు ఎందుకు పెట్టావురా? అంటూ దూషించాడు. అంతేకాకుండా ఆగ్రహంతో కర్ర తీసుకుని ప్రవీణ్ చేతులపై తీవ్రంగా కొట్టాడు. ఇంతలో తల్లి విజయ వచ్చి అడ్డుకుని నిలదీయడంతో కానిస్టేబుల్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దౌర్జన్యంగా తన కుమారుడిని కొట్టిన కానిస్టేబుల్ లింగంనాయక్‌పై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు విజయ తెలిపింది. ఫిర్యాదు చేసి మూడు రోజులైనా కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేయలేదని విలేకర్లకు వివరించారు. విజయ, ప్రవీణ్ ఆరోణలపై ఎస్ఐ కృష్ణయ్యను వివరణ కోరగా కానిస్టేబుల్ లింగంనాయక్‌పై ఉన్నతాధికారులకు రిపోర్టు పంపినట్లు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

సూర్యాపేట క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టు న్యాయమూర్తి ముగ్గురికి జైలు, పలువురికి జరిమానా విధించినట్లు సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించామని, 9మంది మోతాదుకు మించి మద్యం తాగినట్లు తెలిపారు. వారిని బుధవారం సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ బీవీ రమణ ఒకరికి మూడు రోజులు, మరో ఇద్దరికి ఒక రోజు జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.2వేల జరిమానా విధించినట్లు తెలిపారు. అదేవిధంగా మిగిలిన ఆరుగురికి కలిపి రూ.6 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని స్పష్టం చేశారు. వాహనాలు నడిపే వారు విధిగా నిబంధనలు పాటించాలన్నారు.

నేరేడుచర్లలో డీజే సీజ్, ఇద్దరిపై కేసు

నేరేడుచర్ల, మే 28 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలో రామాపురం రోడ్డులో అనుమతులు లేకుండా డీజే పెట్టి సౌండ్ పొల్యూషన్‌కి పాల్పడిన కేసు నమోదు చేసి డీజే వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. మంగళవారం రాత్రి ఏపీ20వై 8173 నెంబరు గల డీజే వాహనం పెద్ద శబ్దాలు పెట్టడంతో వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా డీజేలు పెట్టవద్దని, పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

వలిగొండ, మే 28 (ఆంధ్రజ్యోతి) : పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపారు. మండలంలోని దుప్పెల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో పేకాడుతున్నట్లు సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. పేకాడుతున్న వెల్పుల నర్సింహ, బెంజంకి బిక్షం, బొమ్మగాని మారయ్య, గునగంటి స్వామి, నిమ్మని వెంకటయ్య, కీసరి రామచందర్‌లు పట్టుబడ్డారని ఎస్ఐ తెలిపారు. నిందితుల నుంచి రూ.7800 నగదు, 6 స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తోడల్లుళ్లను బలిగొన్న ఓవర్‌టేక్

● ఉమ్మడి జిల్లాలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి



దేవరకొండలో లారీ వెనక చక్రాల కింద పడి మృతి చెందిన శ్రీశైలం

దేవరకొండ, మే 28 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండలో బుధవారం ఉదయం లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన తోడల్లుళ్లు మృతి చెందారు. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం చింతపల్లి గ్రామానికి చెందిన ఈదమోని శ్రీశైలం(44), ఉరుకొండ మండలం రాచమల్ల గ్రామానికి చెందిన ఈరటు బచ్చయ్య(40)లు తోడల్లుళ్లు. ఇద్దరూ గేదెల క్రయ విక్రయాల వ్యాపారం చేస్తుంటారు. ఇద్దరు కలిసి మంగళవారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లా చింతపల్లి నుంచి బయలుదేరి నల్లగొండ జిల్లా త్రిపురారం మండలకేంద్రానికి చేరుకుని గేదెలను విక్రయించారు. బుధవారం తెల్లవారుజామున త్రిపురారం నుంచి బైక్‌పై బయలుదేరారు. దేవరకొండ పట్టణానికి చేరుకోగానే కొండమల్లేపల్లి నుంచి కల్వకుర్తి వైపు వెళుతోన్న ఐరన్‌లోడు లారీని ఓవర్‌టేక్ చేయబోయారు. ఈ క్రమంలో లారీ బైక్‌ను ఢీకొనడంతో ఈదమోని శ్రీశైలం లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈరటు బచ్చయ్యకు తీవ్ర గాయాలు కాగా దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శ్రీశైలం, బచ్చయ్య కుటుంబ సభ్యులు బుధవారం మధ్యాహ్నం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని దుఃఖసాగరంలో మునిగిపోయారు. శ్రీశైలం కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

● ట్రాక్టర్ సహా బావిలో పడి డ్రైవర్...

ఆత్మకూరు(ఎస్), మే 28 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌ను వెనక్కు నడిపే క్రమంలో వాహనం సహా బావిలో పడి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం రామన్నగూడెం గ్రామ ఆవాసం గౌస్‌తండా సమీపంలో ఈ ఘటన జరిగింది. ఏఎస్ఐ జానకిరాములు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు(ఎస్) మండలం బోరింగ్‌తండాకు చెందిన గుగులోతు రమేష్(38) నూతనకల్ మండలం గుండ్లసింగారం గ్రామానికి చెందిన బొగ్గు బట్టీ వ్యాపారి బండారు శ్రీను వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రామన్నగూడెం శివారు ఏరు సమీపంలోని చెట్ల మొద్దులను బొగ్గు బట్టీ వద్దకు తరలించేందుకు రమేష్ బుధవారం తెల్లవారుజామున ట్రాక్టర్‌తో వెళ్లాడు. మొద్దులు వేసేందుకు కూలీలు సిద్ధంకాగా, ట్రాక్టర్‌ను వెనక్కు నడిపే క్రమంలో రమేష్ ప్రమాదవశాత్తు సమీపంలోని బోర్రెజు మల్లయ్య వ్యవసాయ బావిలో ట్రాక్టర్‌తో పాటు పడిపోయాడు. బావిలో నీరు లోతుగా ఉన్నందున రమేష్ నీటిలో మునిగి అక్కడికక్కడే మృతి చెందాడు. కూలీలు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్రేన్, అగ్నిమాపక సిబ్బంది సహకారంతో ట్రాక్టర్‌ను, రమేష్ మృతదేహాన్ని బయటికి తీశారు. సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. రమేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రమేష్ భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జానకిరాములు తెలిపారు.



బావిలో పడిన ట్రాక్టర్‌ను బయటకు తీస్తున్న సిబ్బంది, డ్రైవర్ గుగులోతు రమేష్ (ఫైల్ ఫొటో)

గేదెలు బైక్‌ను ఢీకొని విద్యుత్ ఉద్యోగి



సైదులు(ఫైల్‌ఫొటో)

పాలకవీడు, మే 28 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం బెట్టితండాలో బైక్‌ను గేదెలు ఢీకొన్న ఘటనలో విద్యుత్ ఉద్యోగి మృతి చెందాడు. ఎస్ఐ లక్ష్మీనర్సయ్య బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జాన్‌పహాడ్‌కు చెందిన షేక్ సైదులు అలియాస్ జాన్‌సైదా(42) విద్యుత్ శాఖలో లైన్‌మన్ కింద ఆర్టిజన్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. విధుల్లో భాగంగా ఈ నెల 27న జాన్ పహాడ్ గ్రామంలో వినియోగదారులు చెల్లించిన విద్యుత్ బిల్లులను తీసుకుని మండలకేంద్రంలోని కార్యాలయంలో జమచేసి తిరిగి జాన్‌పహాడ్ గ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో బెట్టిగూడెం వద్ద గేదెలు సైదులు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొన్నాయి. తీవ్ర గాయాలైన సైదులను అంబులెన్స్‌లో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సైదులు బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ కింద పడి బిహార్ కూలీ

శాలిగౌరారం, మే 28 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం చిత్తలూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో లారీ కింద పడి బిహార్ రాష్ట్రానికి చెందిన కూలీ మృతి చెందాడు. ఎస్ఐ సైదులు తెలిపన వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రంలోని సహ్రస జిల్లా బలుహా గ్రామ బైజ్‌నాథ్‌పట్టికి చెందిన సూరజ్ కుమార్(20) అదే ప్రాంతానికి చెందిన 11మందితో కలిసి చిత్తలూరులోని ఐకేపీ కేంద్రంలో హమాలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేస్తున్నాడు. అదే సమయంలో ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం రావడంతో వర్షానికి తడవకుండా నలుగురు హమాలీలు లారీ కిందికి వెళ్లారు.

లారీ డ్రైవర్ గమనించకుండా లారీని ముందుకు కదిలించాడు. గమనించిన లారీ కింద ఉన్న నలుగురు హమాలీల్లో ముగ్గురు బయటకు రాగా తప్పించుకునే క్రమంలో సూరజ్‌కుమార్ పైనుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే విషయం తెలుసుకున్న శాలిగౌరారం పోలీసులు సూరజ్ కుమార్ మృతదేహాన్ని ఆటోలో నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బుధవారం సూరజ్‌కుమార్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. సూరజ్‌కుమార్ మేనమామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

పెండ్లి పత్రికలు పంచి వస్తూ...

కనగల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి పత్రికలు పంచి వస్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఒకరు దుర్మరణం చెందారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలం జీ.చెన్నారం గ్రామస్టేజీ సమీపంలో నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారిపై బుధవారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ మండలం ముశంపల్లి గ్రామానికి చెందిన తౌడోజు వెంకటాచారి(50) నల్లగొండ పట్టణం శాంతినగర్‌లో నివాసముంటూ లాడ్జి మేనేజర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా తన దగ్గరి బంధువు ఇంట్లో జరిగే పెళ్లి వేడుక ఆహ్వాన పత్రికలను పంచేందుకు దర్వేశిపురం వచ్చి తిరిగి నల్లగొండకు వెళ్తున్నాడు.

ఈ క్రమంలో మార్గమధ్యలోని జీ.చెన్నారం స్టేజీ వద్ద వెంకటాచారి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వెంకటాచారికి భార్య ఇద్దరు కుమార్తెలున్నారని బంధువులు తెలిపారు. భార్య పారిజాతం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నిద్రలో దడదడ

● రహదారిపై రంబుల్ స్ట్రిప్స్‌తో విపరీతమైన శబ్దాలు


● కంటినిండా నిద్రలేక ప్రజల అవస్థలు



మునగాలలో హైదరాబాద్-విజయవాడ రహదారిపై ఏర్పాటుచేసిన రంబుల్ స్ట్రిప్స్‌పై వెళ్తోన్న వాహనాలు

మునగాల, మే 28 (ఆంధ్రజ్యోతి) : వేగ నియంత్రణతో పాటు డ్రైవర్ల నిద్రమత్తును వదిలించేలా రహదారులపై ఏర్పాటుచేసిన రంబుల్ స్ట్రిప్స్(కొద్దిపాటి మందంతో కూడిన పట్టి) సమీపంలోని ప్రజలకు నిద్రపట్టనివ్వడం లేదు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(65వ నెంబరు)పై పెద్దసంఖ్యలో వాహనాల రాకపోకలు నిత్యం జరుగుతుంటాయి. ఈ క్రమంలో వాహనాలు నెమ్మదిగా, వన్‌వేగా వెళ్లాలనే ఉద్దేశంతో పోలీసులు స్టాప్‌బోర్డులను ఏర్పాటు చేశారు. అయినా ప్రమాదాలు తరుచూ చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణకు హైవేపై మూడు లేయర్లుగా రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటుచేశారు. సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలోనూ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన రంబుల్ స్ట్రిప్స్‌పై వెళ్లే వాహనాలు చేసే దడ దడా శబ్దానికి సమీపంలోని నివాస ప్రజలకు రాత్రి పూట కంటినిండా నిద్రపట్టక నానా అవస్థలుపడుతున్నారు. ప్రతిరోజూ రాత్రి సమయంలో ఈ రంబుల్ స్ట్రిప్స్ సమీపంలో వాహనాల శబ్దాలతో పిల్లలు, చిన్నారులు నిద్రపోవడం లేదని స్థానికులు తెలిపారు. వేగ నియంత్రణకు గ్రామశివారులోనే ఈ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలంటున్నారు. ఊరులో మధ్యంలో ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నారు. కేంద్ర మంతి గట్కరీ రంబుల్ స్ట్రిప్స్ తొలగించాలని ఆదేశించినా అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రంబుల్ స్ట్రిప్స్ తొలగించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని స్థానికులు తెలిపారు.

వాహనాల శబ్దంతో నిద్రలేక ఇబ్బందులు పడుతున్నాం



రంబుల్ స్ట్రిప్స్ వద్ద వాహనాల శబ్దంతో రాత్రి పూట నిద్రపట్టటం లేదు. జన నివాసాల మధ్య స్ట్రిప్స్ ఏర్పాటు మంచిది కాదు. ఊరు శివారులో ఏర్పాటుచేయాలి. రోడ్డు వెంట ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారులు శబ్దాలు వినలేక ఇబ్బంది పడుతున్నారు. చిన్నపిల్లలు వణికిపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి తొలగించాలి.

కొప్పుల నర్సింహారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు

వాహనాలు, బైక్‌లు దెబ్బతింటున్నాయి



రంబుల్ స్ట్రిప్స్ సమీపంలో కార్లు, భారీ వాహనాలు, బైక్‌లు దెబ్బతింటున్నాయి. ఒక్క లేయర్ వేస్తే స్పీడ్ కంట్రోల్‌లోకి వస్తుంది.మూడు లేయర్లు వేయటం సరి కాదు. ఈ స్ట్రిప్స్ వల్ల వస్తున్న శబ్దాలతో చెవులకు చిల్లులు పడే పరిస్థితి ఏర్పడింది. గ్రామం శివారులో ఏర్పాటు చేయాలి, అధికారులు పునరాలోచన చేసి వాటని తొలగించాలి.

బంగారపు సత్యం, మునగాల

అనాథ ఆశ్రమానికి పరుపుల వితరణ



చారుమతి చైల్డ్‌కేర్ ఆశ్రమానికి పరుపులు అందజేస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

నల్లగొండ టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రం శివారు పానగల్‌లోని చారుమతి చైల్డ్‌కేర్ ఆశ్రమంలో ఉన్న అనాథ పిల్లలకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నీలగిరి బ్రాంచ్ తరపున 20 మందికి బుధవారం పరుపులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్. పుల్లారావు సీనియర్ ఐఎంఏ డాక్టర్ ఏవీ. శ్రీనివాసరావు, నీలగిరి బ్రాంచ్ ప్రెసిడెంట్ డాక్టర్ దామర యాదయ్య, నరేష్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

మూగజీవికి ప్రాణం పోసి..

కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలలో గేదెకు అరుదైన శస్త్ర చికిత్స



గేదెకు శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు

కోదాడ రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలలో బుధవారం గేదెకు అరుదైన శస్త్ర చికిత్స జరిగింది. అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం ఆర్లెగూడెం గ్రామానికి చెందిన వెంకటరమణ పాడిగేదె ఆదివారం మేతకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో కింది దవడ ఎముక విరిగి దంతాల ప్యాడ్ కూడా పెదవి నుంచి విడిపోయింది. గేదె నోటి ఎముక దంతాలు విరగడంతో మేత, నీరులేక రెండు రోజులుగా బాధపడుతోంది. చికిత్స నిమిత్తం గేదెను బుధవారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలకు తీసుకొచ్చారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ చంద్రమోహన్, డెంటిస్ట్ డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావుల సహకారంతో దవడ గేదె ఎముకకు డ్రిల్లింగ్ చేసి స్టెయిన్‌లెస్ స్టీల్ వైరుతో దవడ ఎముకకి, పంటి పలుకకు కుట్లు వేసి మత్తుద్వారా గేదె ఏడు నెలల సూడికి నష్టం జరగకుండా కింది పెదవి ఎముకను, దంతాలను విజయవంతంగా అతికించారు. ఆపరేషన్ తర్వాత గేదె స్వతహాగా నీరు తాగడంతో పాటు ఆహారం తీసుకుంటుందని రైతు తెలిపారు. ఆపరేషన్‌కు కాపుగల్లు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సురేంద్ర, సిబ్బంది రాజు, చంద్రకళ, అఖిల్ సహకరించారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు.. యువకుడి మృతి

వేములపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): కారు డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టడంతో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శివారులోని బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామానికి చెందిన నామిరెడ్డి అరవింద్‌రెడ్డి(25) తన కారులో రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరాడు. శెట్టిపాలెం శివారులోని చిత్రపరక వాగు సమీపంలో కారు అదుపుతప్పి బ్రిడ్జి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారు పల్టీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన అరవింద్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. అరవింద్‌రెడ్డి నామిరెడ్డి, పుల్లారెడ్డి సునీతల ఏకైక కుమారుడు. అరవింద్‌రెడ్డి బీబీఏ పూర్తి చేసి ఎంబీఏ కోసం సిద్ధమతున్నాడని తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

పోచంపల్లిలో ఆఫ్రికన్ ప్రతినిధులు

● పోచంపల్లి టూరిజం సెంటర్‌ను సందర్శించిన 30మంది ప్రతినిధులు ● ఇక్కత్ డిజైన్లను పరిశీలించి అబ్బురపడిన యువతులు





భూదాన్‌పోచంపల్లి రూరల్ టూరిజం సెంటర్ వద్ద ఆఫ్రికన్ ప్రతినిధులు, రాట్నం తిప్పుతున్న ఆఫ్రికన్ యువతి

భూదాన్‌పోచంపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో ఆఫ్రికా ఖండంలోని 15దేశాలకు చెందిన 30మంది ప్రతినిధులు బుధవారం పర్యటించారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఐదు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం ఆఫ్రికా ఖండంలోని 15మధ్య పశ్చిమ ఆఫ్రికన్ దేశాల 30 మంది సోషల్ మీడియా, కంటెంట్ క్రియేటర్లు పోచంపల్లి పర్యాటక గ్రామాన్ని సందర్శించారు. స్థానిక సాంస్కృతిక కళలతో, మ్యూజిక్‌తో మమేకమయ్యారు. ప్రత్యేకమైన ఇక్కత్ చీరల తయారీ విధానాన్ని పర్యాటక మ్యూజియంలోని లీవ్ టు క్లాత్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించి చేనేత వస్త్ర తయారీ ప్రక్రియలను ప్రత్యక్షంగా వీక్షించారు. ఇక్కత్ తయారీ విధానాన్ని పరిశీలించిన అతిథులు నూలు వడకడం నుంచి రంగులు చొప్పించే క్లిష్టమైన ప్రక్రియలను చూసి ఆశ్చర్యచకితులయ్యారు. 'ఒక్క చీరకు వారం రోజులపాటు తీసుకునే శ్రమ, డిజైన్ల సృజనాత్మకత' వారి మనస్సును హత్తుకుంది. చీరలపై భిన్న డిజైన్లను గమనించిన అతిథుల్లో కొందరు స్వయంగా రాట్నంతో నూలు వడికే ప్రయత్నం చేశారు. అనంతరం వారు పోచంపల్లి ఇక్కత్ చీరల తయారీని పరిశీలించారు. భారత దేశ సంస్కృతి, సంప్రదాయాలను ఆఫ్రికా ఖండంలోని దేశాల్లో చాటుతామన్నారు. మరికొందరు చీరలు కొనుగోలు చేశారు. అనంతరం వారు రామోజీ ఫిలింసిటీకి బయల్దేరి వెళ్లారు.

వస్త్ర పరిశ్రమను కాపాడుకోవాలి

ఎగుమతుల ప్రమోషన్ కార్యక్రమంతో పోచంపల్లి వస్త్ర పరిశ్రమ వారసత్వ నైపుణ్యాలను కాపాడుకోడంతోపాటు పారిశ్రామికుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని జగదీష్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ అన్నారు. బుధవారం పట్టణంలోని పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ ఆధ్వర్యంలో జగదీష్ ప్రైవేట్ లిమిటెడ్, టీజీటీపీసీ (తెలంగాణస్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్) సంయుక్తంగా ఎంఎస్ఎంఈల(టెక్స్‌టైల్ రంగంలోని) అంతర్జాతీయ ఎగుమతులు పెంపొందించేందుకు ఆర్ఏఎంపీ కార్యక్రమం నిర్వహించారు. రైజింగ్ యాక్సెసరీ అండ్ ఎంఎస్ఎంఈ ప్రోగ్రాం - ఆర్ఏఎంపీ పథకాన్ని భారత ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్ సహకారంతో ప్రారంభించింది. జీఐ ట్యాగ్ కలిగిన పోచంపల్లి ఇక్కత్ టెక్నాలజీని, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్‌ను మరింత ప్రాచుర్యంలోకి తేవడం ద్వారా ప్రాంతీయ ప్రజలు సమూహంగా, సమష్టిగా ప్రయోజనాన్ని పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో భారత లవకుమార్, ఫారిన్ ట్రేడ్ డెవలప్‌మెంట్ రిటైర్డ్ ఆఫీసర్ పీఎస్‌బీ శాస్త్రి, జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ శ్రీనివాస్‌రావు, జంగయ్య, అంతర్జాతీయ ఎగుమతుల ఎక్స్‌పర్ట్ శ్రీదేవి, శివకుమార్, బాలకృష్ణ, జగదీష్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో దీపిక పాల్గొన్నారు.

దక్షిణాఫ్రికాకు ప్రాతినిధ్యం.. దక్షిణాది మూలాలు పదిలం!



యోవానీనాయుడు అనే యువతి కంటెంట్ క్రియేటర్‌గా దక్షిణాఫ్రికా దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. భారత దేశ పర్యటనలో భాగంగా హైదారాబాద్‌కు చేరుకున్నారు. ఐదు రోజుల పర్యటనలో భాగంగా ఆఫ్రికా ఖండంలోని 15 దేశాలకు చెందిన 30మంది భారత దేశ పర్యటనలో ఆమె మార్గదర్శనం చేశారు. నాలుగు రోజుల క్రితం వారితో హైదరాబాద్‌కు చేరుకున్నారు. యోవానీ నాయుడు పేరులోనే కాదు.. ముఖ కవళికల్లో అచ్చు తెలుగుదనం, భారతీయత ఉట్టిపడుతోంది. తండ్రి తెలుగు వ్యక్తి కాగా, తల్లిది తమిళనాడు. వారి పూర్వీకులు శతాబ్దాల క్రితం దక్షిణాఫ్రికా వలస వెళ్లారు. దక్షిణాఫ్రికాలోని డర్బన్ నివాసి. తాను ఆరో తరానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తెలుగు, తమళనాడు భాషలు రాకున్నా.. సంస్కృతి, సంప్రదాయాలకు దూరం కాలేదు. కట్టు, బొట్టు, సంప్రదాయ దుస్తుల్లో ఉంటూ.. స్థానిక భారతీయురాలిలాగే కనిపిస్తుంది యోవానీ నాయుడు. ఆమె సైంటిస్టుగా పనిచేస్తున్న వెస్టన్, ట్రెడిషన్ సంగీతాన్ని మేళవిస్తూ మ్యూజిక్, కల్చర్, లాంగ్వేజెను ప్రమోటింగ్ చేస్తుంది. తెలుగు పాటలు చక్కగా పాడే ఆమె టాలీవుడ్, కోలివుడ్‌లకు గ్రేట్ ఫ్యాన్ అంటూ దక్షిణాఫ్రికాకు ప్రాతినిధ్యం వహించడం తనకు గర్వంగా ఉందన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



ప్రాకార మండపంలో నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మే 28(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభూవులను, సువర్ణ ప్రతిష్టామూర్తులను అభిషేకరించి తులసీదళాలతో సహస్రనార్చనలు నిర్వహించారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండిజోడు సేవలు, సహస్రనార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.30,83,173 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావు తెలిపారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్. మధుసూదన్‌రావు దర్శించుకునేందుకు కుటుంబ సమేతంగా వేర్వేరుగా యాదగిరిగుట్టకు వచ్చారు. గర్భాలయంలోని స్వయంభూవులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పండితులు వారికి స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి ఆశీర్వచనం చేశారు.

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో స్వామి నిత్య కల్యాణాన్ని వేద పండితులు నిర్వహించారు. ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహావాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగళ్యధారణ తలంబ్రాలుతో నిత్య కల్యాణం నిర్వహించారు. నీరాజనమంత్రపుష్పాలతో మహానివేదన గావించి తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండనవీన్, ఆలయ అర్చకులు తూమాటిశ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణామాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, లక్ష్మీనరసింహామూర్తి,సీతరామశాస్త్రీ, శేషగిరిరావు, రాజష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చింతపల్లి ఆలయ వార్షికోత్సవాలు

చింతపల్లి, మే 28(ఆంధ్రజ్యోతి): సాయినాథుడి అనుగ్రహం పొందాలని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో 18వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఆలయంలో 300 గోవులను పెంచి ధర్మసంస్థాపనకు ట్రస్టు చైర్మన్, సభ్యుల కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి, టీవీఎన్‌రెడ్డి, ఉజ్జిని విద్యాసాగర్‌రావు, ఎల్లంకి ఆశోక్, బాదేపల్లి నిరంజన్‌గౌడ్, వందనపు అంజనేయులు, ఎండి.ఖలేద్, సీమర్ల శ్రీను పాల్గొన్నారు. ముక్కామల పీఠాధిపతి శ్రీధర్ స్వామి, చండీఉపాసకుడు కొడకండ్ల రామచరణ్‌శర్మ, శానగొండ శివకిరణ్‌శర్మ ఆధ్వర్యంలో వాస్తు హోమం నిర్వహించారు. కార్యక్రమంలో కొమిరిశెట్టి వెంకటయ్య, పూరె కృష్ణయ్య, కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ల శ్రీనివాస్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లి: షిర్డీసాయిబాబా ఆలయ పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్ర

నాగార్జునసాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	512.60
టీఎంసీలు	136.1274
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	5,598
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	96,324
ఎస్ఎల్‌బీసీ ద్వారా	900 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	6,498 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	25.43 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	638.50 అడుగులు
టీఎంసీలు	2.88
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	1812. 14 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	91.35 క్యూసెక్కులు

ఉమ్మడి జిల్లాలో మోస్తరు వర్షం



శాలిగౌరారం మండలం వంగమర్తి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీనది

నల్లగొండ, శాలిగౌరారం, కేతేపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. నల్లగొండ జిల్లా గుండపల్లి మండలం సింగరాజుపల్లిలో అత్యధికంగా 2.2 సెంటీమీటర్లు, అత్యల్పంగా చందంపేటలో 0.8మిల్లీమీటర్లు, సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో 1.3 మిల్లీమీటర్లు, యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లిలో 3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నది

నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వంగమర్తి వద్ద మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజుల నుంచి వస్తున్న వరదకు మూసీ నది ఉధృతంగా ప్రవహించడంతో జలకళ సంతరించుకుంది. నది పరివాహక గ్రామాలైన ఉప్పలంచ, మునిమద్దె, గురజాల, తుడిమిడి, చిత్తలూరు, వంగమర్తి వద్ద బాగా మూసీనది ప్రవహిస్తోంది.

639 అడుగులకు చేరిన మూసీ నీటిమట్టం

అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఎగువ నదీ పరీవాహక ప్రాంతాలు హైదరాబాద్ నగరంలో కురుస్తున్న వర్షాలకు మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ దిశగా పయనిస్తోంది. నెల రోజులకు పైగా ఐదారు వందల క్యూసెక్కులుగా నిలకడగా ఉంటున్న ఇన్‌ఫ్లో బుధవారం 1812 క్యూసెక్కులుగా నమోదైంది. మంగళ, బుధవారాల్లో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలతో పాటు ఎగువ మూసీ పరివాహక గ్రామాల్లో కురిసిన భారీ వర్షాలకు వరద నీరు క్రమంగా దిగువన గల మూసీ ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. దీంతో 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 639అడుగులకు (2.89టీఎంసీలు)చేరింది. వేసవిలోనే ప్రాజెక్టు జలకళను సంతరించుకుంటుండడంతో ఆయకట్టు గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అల్పపీడన ద్రోణికి రుతుపవనాలు తోడవడంతో వచ్చే నాలుగైదు రోజులు వర్షాలు కురిసే వీలుందని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో జూన్ తొలివారంలోనే పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరే వీలు ఉందని రైతులు చర్చించుకుంటున్నారు.

ఎల్లమ్మతల్లీ.. దీవించు



ఎల్లమ్మ తల్లి ద్వారానికి భక్తులు కట్టిన తొట్టెల ముడుపులు

ఆ తల్లిని వేడుకుంటే కోర్కెలు తీరినట్టే.. తొట్టెల ముడుపు కడితే 'కడుపు' పండినట్టే..! ఇదీ నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం గుట్టపైన వెలసిన (బావని) ఎల్లమ్మ దేవత పట్ల మహిళలకు ఉన్న విశ్వాసం. అందుకే కొత్తగా నవ దంపతులు లేదా పెళ్లి అయి ఏళ్ల గడిచినా సంతాన భాగ్యానికి నోచని దంపతులు చెర్వుగట్టు క్షేత్రానికి వచ్చి ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్నారు. 'అమ్మా'..అనే పిలుపు కోసం ఆరాటపడుతున్నారు. మాతృత్వపు వరాన్ని కోరుతూ 'తొట్టెల'ను ముడుపుగా కడుతున్నారు. కడుపు పండించమని తల్లిని మొక్కుకుంటున్నారు.

● (ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి)

ఎంజీయూ డిగ్రీ బ్యాక్ లాగ్ ఫలితాల విడుదల

నల్లగొండ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): సంవత్సరం విధానంలో డిగ్రీ అభ్యసించి ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు చిట్టచివరి సారి అవకాశం కల్పించి మార్చి/ఏప్రిల్ నెలల్లో నిర్వహించిన పరీక్షల ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు సీవోఈ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల పూర్తి వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

గరిడేపల్లి, మే 28(ఆంధ్రజ్యోతి): అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని గడ్డిపల్లి పాలిటెక్నిక్ ఇన్ హార్టికల్చర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఘంటా సత్యనారాయణరెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని గడ్డిపల్లి హార్టికల్చర్ ఇన్ పాలిటెక్నిక్ కళాశాలలో హార్టికల్చర్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం సమత కంపెనీ ఆధ్వర్యంలో హార్టికల్చర్ కార్యదర్శి స్నేహలత పర్యవేక్షణలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండి వెంకటేశ్వరరావు, సోము బాల చౌడరెడ్డి, జోనల్ హెడ్ ఎం. సాయి, రీజనల్ మార్కెటింగ్, మేనేజర్ కళాశాల ఇన్‌చార్జి సీహెచ్. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కలిసొచ్చిన కాలం.. మొలకెత్తిన విత్తనం

● సిద్ధం చేసిన దుక్కుల్లో పత్తి విత్తనాలు విత్తిన రైతులు



మోత్కూరులో మొలకెత్తిన పత్తి విత్తనాలు

మోత్కూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): ఒకట్రెండు వర్షాలకు విత్తనాలు విత్తరు. ఒక వేళ విత్తితే ఎండలకు విత్తనాలు మొలకెత్తకుండా భూమిలోనే వట్టిపోతాయి. కాని సారి కత్తెర చివరి పాదం నుంచి రోహిణిలో కూడా వర్షాలు కురుస్తుండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. మే నెలలో కురిసిన వర్షాలకు పలువురు రైతులు మెట్ట పంటల సాగుకు దుక్కులు దున్ని సిద్ధం చేసి పెట్టుకున్నారు. కత్తెర కార్తెలో ఈ నెల 21న వర్షం కురియడంతో యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలంలో దుక్కులు సిద్ధం చేసి పెట్టుకున్న రైతుల్లో కొందరు ధైర్యం చేసి ఈ నెల 22న పత్తి విత్తనాలు విత్తారు. ఈ నెల 25నుంచి రోహిణి కార్తె ప్రారంభమైంది. రోహిణిలోనూ వర్షాలు కురుస్తుండడంతో కత్తెర కార్తె చివరి పాదంలో విత్తిన పత్తి విత్తనాలు శ్రేష్టంగా మొలకెత్తాయి. రోహిణిలో కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పత్తి విత్తనాలు విత్తుతున్నారు. ఇప్పటికి దుక్కులు సిద్ధం చేయని రైతులు ఈ వర్షాలకు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. ముందుగా విత్తనాలు విత్తడం వల్ల నవంబరు, డిసెంబరు మాసాల్లో వర్షాలు లేకపోయినా అప్పటికే పత్తి దిగుబడి చేతికి వస్తుందని, నష్టం జరగదని రైతులు చెబుతున్నారు. ఒక వేళ నవంబరు, డిసెంబరు మాసాల్లో వర్షాలు కురిస్తే తమకు రెండో పంట కూడా వస్తుందని చెబుతున్నారు. ఇప్పుడు వర్షాలు కురియడం లాభదాయకంగానే ఉంటుందంటున్నారు. ఈ వర్షాలకు బలమైన కార్తెలో విత్తనాలు విత్తడంతో పాటు, గొర్రెలు, పశువులకు త్వరగా పచ్చగడ్డి దొరుకుందని, వానాకాలం వరి పంటకు ఈ కార్తెలోనే నార్లు కూడా పోసుకోవచ్చని రైతులు చెబుతున్నారు. ఇప్పుడు ముందుగా కురిసిన వర్షాలు ఆ తర్వాత ముఖం చాటేస్తే మాత్రం నష్టం జరుగుతుందని పేర్కొంటున్నారు రైతులు.

పత్తి విత్తనాలు శ్రేష్టంగా మొలకెత్తాయి



బలమైన కార్తె అన్న భావనతో ఈ నెల 21న కురిసిన వర్షానికి నేను పది ఎకరాల్లో పత్తి విత్తనాలు విత్తాను. నేను విత్తనాలు విత్తిన తర్వాత కూడా వర్షాలు కురియడంతో పత్తి విత్తనాలు శ్రేష్టంగా మొలకెత్తాయి. రోహిణి కార్తెలో కురుస్తున్న వర్షాలకు చాలామంది రైతులు విత్తనాలు విత్తుతున్నారు. నేను ధైర్యం చేసి ముందుగా విత్తనాలు విత్తినందుకు వర్షాలు కురవడం కలిసొచ్చింది.

● మర్రి మధు, పత్తిరైతు, మోత్కూరు.

పంటలకు మద్దతుధర ప్రకటించడంపై హర్షం

వలిగొండ, మే 28 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన 14 రకాల పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వరితో పాటు ఇతర 14 రకాల పంటలకు కూడా మద్దతూ ధర ప్రకటించడం హర్షణీయమన్నారు. బీజేపీ నాయకులు ఏలే చంద్రశేఖర్, బందారపు లింగస్వామి, బోళ్ల సుదర్శన్, కొప్పుల యాదిరెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

స్వర్ణగిరిలో 108 సువర్ణ పుష్పాలతో అభిషేక పూజలు

భువనగిరి టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): స్వర్ణగిరిలో వేంకటేశ్వరస్వామి నిత్యపూజలు, కల్యాణోత్సవాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అష్టోత్తర శతనామాలతో అష్ట దళ పాదపద్మార్చన సేవ నిర్వహించారు. 108 సువర్ణ పుష్పాలతో అభిషేకం నిర్వహించారు. మృగశిర నక్షత్రాన్ని పురస్కరించుకుని పద్మావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీవారి ఉత్సవ మూర్తులను ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు.



మోత్కూరు: హైదరాబాదులో బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో జరిగిన గురుకులాల అవార్డుల ఫంక్షన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతోపాటు పాల్గొన్న తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు

రాజాపేటలో తిరంగా యాత్ర



తిరంగా యాత్రలో పాల్గొన్న ప్రజలు

రాజాపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో రాజాపేట మండల కేంద్రంలో బుధవారం తిరంగా యాత్ర నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. మండలంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులతో పాటు ఉద్యోగులు గ్రామస్తులు యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్‌గౌడ్ మాట్లాడుతూ దేశ భద్రతలో వివిధ దళాల బలగాలు తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడాయన్నారు. నాయకులు రాజు, రమేష్, మాధురి, భాగ్యలక్ష్మి, నర్సింగరావు, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

నెరవేరనున్న సొంత ఇంటి కల

- వేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు
- మండలంలో 427 ఇల్లు మంజూరు

బొమ్మలరామారం, మే 28 (ఆంధ్రజ్యోతి): సామాన్యుడి జీవితంలో సొంతంగా పక్కా గృహం నిర్మించుకోవాలనేది ఒక కల. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల రూపంలో సొంతింటి కలను సాకారం చేయనుంది. మండలంలోని 34 గ్రామపంచాయతీలు ఉండగా ఎల్1 జాబితా ప్రకారం 2791 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. గత నెలలో ఆయా గ్రామాల్లో కమిటీ సభ్యులు ఎంపిక చేసే విధానం ప్రకారం మండల వ్యాప్తంగా 427 మందికి ఇళ్లు మంజూరు అయ్యాయి.

ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం

మండల వ్యాప్తంగా మంజూరైన ఇళ్ల నిర్మాణానికి కొలతలు వేయడంతో పాటు ముగ్గు పోయించి పనులు ప్రారంభించారు. నిబంధన ప్రకారం 40 నుంచి 60 గజాల లోపు కొలతలతో నిర్మాణ పనులు చేట్టాలి. ఇంటి నిర్మాణానికి కావాల్సిన ఇసుక మాత్రం ప్రభుత్వ సరఫరా చేయగా, సిమెంట్, స్టీల్ తక్కువ ధరలో అందించే విధంగా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్టు మండల స్థాయి అధికారులు పేర్కొంటున్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గుపోస్తున్న లబ్ధిదారులు

నాలుగు విడతల్లో పెట్టుబడి అందజేత

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ డబ్బులు, నాలుగు విడతల్లో మంజూరు అవుతాయని, మొదట పెట్టుబడిగా లక్ష రూపాయలతో నిర్మాణ పనులు చేపట్టవలసి ఉంటుంది. లక్ష రూపాయలతో బేస్మెంట్ వరకు పనులు పూర్తి చేసిన తర్వాత, మొదటి విడతలో లక్ష రూపాయలు మంజూరు అవుతాయి. గోడలు కట్టిన తర్వాత రెండో విడత లక్ష యాభైవేలు, ఇంటి స్లాబ్ వేసిన తర్వాత మూడో విడతలో మరో లక్ష యాభై వేలు, పనులు మొత్తం పూర్తయిన తర్వాత నాలుగో విడతలో మిగిలిన లక్ష విడుదల అవుతాయి. మొదట పెట్టుబడికి డబ్బులు లేనివారు మహిళా సంఘాల నుండి లక్ష వరకు లోను కూడా మంజూరు అయ్యే అవకాశం ఉంది. మండల స్థాయి గ్రామాల్లోని మేస్త్రీలతోనే పనులు చేపట్టాల్సి ఉంటుంది.

సొంత ఇల్లు కల నెరవేరుతోంది



సొంతంగా ఇల్లు లేకపోవడంతో 10 సంవత్సరాలకు పైగా కిరాయి ఇంట్లో ఉంటున్నాం. ఇల్లు కట్టుకోవడానికి డబ్బులు లేకపోవడంతో గత ప్రభుత్వంలో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నాం. మాకు రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి, ఇచ్చిన మాట నిలబెట్టుకుంది.

-బండి కల్పన, బొమ్మలరామారం

సర్పంచ్‌గా చేసి కూడా కిరాయి ఇంట్లోనే



బొమ్మలరామారం మండల కేంద్రానికి ఐదేళ్ల పాటు సర్పంచ్ పదవి చేపట్టినా సొంత ఇళ్లు లేక కిరాయి ఇంట్లోనే ఉంటున్నాను. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం పొందలేకపోయాను. ఇల్లు మంజరైనందుకు ఆనందంగా ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితి బాగాలేదు. మంజూరైన ఇంటి నిర్మాణ పనులు ఎట్లా చేపట్టాలో అర్థం కావట్లేదు.

-కెంసారం లక్ష్మి, మాజీ సర్పంచ్

నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకోవాలి. మధ్యంతరాన నిర్మాణ పనులు నిలిపివేయొద్దు. ఎంత త్వరగా పనులు పూర్తి చేస్తారో, అంత త్వరగా విడతల వారీగా డబ్బులు విడుదల అవుతాయి. నిర్మాణ పనుల్లో ఇలాంటి ఇబ్బందులు ఉన్నా మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాం.

-రాజా త్రివిక్రమ్, ఎంపీడీవో, బొమ్మలరామారం

గ్రామం	మంజూరైన ఇళ్లు
బోయినపల్లి	18
బండకాడపల్లి	08
బొమ్మలరామారం	32
చీకటిమామిడి	11
చౌదర్‌పల్లి	18
ఫకీర్‌గూడెం	09
గోవింద్‌తండా	08
హాజీపూర్	09
జలాల్‌పూర్	24
కంచల్‌తండా	05
కేకే తండా	08
లక్ష్మీతండా	14
మాచినపల్లి	07
మైలారంకింది తండా	07
మల్యాల	06
మర్యాల	36
మేడిపల్లి	16
మునిరాబాద్	08
మైలారం	12
యావపూర్	10
వాలుతండా	08
తూముకుంట	14
తిరుమలగిరి	08
తిమ్మాపూర్	26
సోలిపేట	12
రంగాపూర్	04
రామస్వామి తండా	04
రామలింగాపల్లి	13
ప్యారారం	16
పీజీ తండా	13
పర్వతాపూర్	08
నాయకునితండా	08
నాగినేనిపల్లి	24
మైసిరెడ్డిపల్లి	10

పండుగలు ఐక్యంగా నిర్వహించాలి

రాజాపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): పండుగలు అందరూ కలసికట్టుగా నిర్వహించాలని, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని ప్రభుత్వవిప్ బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం రాజాపేట మండలం చల్లూరు గ్రామంలో జరుగుతున్న బీరప్ప ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ఊరేగింపులో పాల్గొని మాట్లాడారు. నాయకులు రమేష్, కరుణాకర్, సుధాకర్, బాల్‌నర్సయ్య పాల్గొన్నారు.

సావర్కర్ జీవితం స్ఫూర్తిదాయకం

చౌటుప్పల్ టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): హిందూ సమాజంలో ఐక్యతను సాధించేందుకు ప్రాణ త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక దామోదర్ సావర్కర్ జీవితం స్ఫూర్తిదాయకమని భారత్ వికాస్ పరిషత్ కొమరం భీమ్ చౌటుప్పల్ బ్రాంచ్ సంస్కార్ కన్వీనర్ యువరాజ్ అన్నారు. స్థానిక జడ్పీహెచ్ఎస్ లో సావర్కర్ 142 వ జయంతి నిర్వహించారు. సావర్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు చీకూరి వెంకటేశం, హెచ్ఎం శివకుమార్, పీడీలు లింగయ్య, శోభ, అనిల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

భువనగిరి గంజ్, మే 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని బలోపేతం కృషి చేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్లో భువనగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ క్రియాశీలక కార్యకర్తల సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే కార్యాచరణలో భాగంగా మండల స్థాయి నుంచి పీసీసీ దాకా కార్యవర్గాలను ఏర్పాటు చేసేందుకు అగ్రనాయకత్వం రూట్ మ్యాప్‌ను ఖరారు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్లకు ప్రాధాన్యం ఇస్తూనే మహిళలు, యువతకు పదవుల్లో పెద్దపీట వేయాలని అధిష్టానం నిర్ణయించడం, ఇకపై పార్టీ కమిటీలే అన్ని నిర్ణయాల్లో కీలక పాత్ర వహిస్తాయని అన్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పదేళ్లపాటు సైనికుల్లా పనిచేసిన కార్యకర్తలకు, నాయకులకు పదవులు ఇవ్వాలని అధిష్టానం నిర్ణయించిందన్నారు. పార్టీలో మండల, బ్లాక్ డీసీసీ పదవుల్లో సీనియర్లకే ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారన్నారు. 2017నుంచి పార్టీలో ఉన్నవారికే పదవులు ఇవ్వాలని సూచించారని, పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణపై గాంధీభవన్లో జరిగిన సమావేశంలో కీలకమైన సూచనలు చేశారని తెలిపారు. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాల అమలును ప్రజల్లోకి బలంగా తీసువెళ్లాలని, జూన్, జూలై మాసాల్లో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని గుజరాత్ మోడల్లో సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు అధిష్టానం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఆరు గ్యారంటీల పథకాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశామని, గడిచిన 15నెలల్లో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ సేవలు 5లక్షల నుంచి 10లక్షలకు పెంచడం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రేషన్ కార్డుల మంజూరు 200యూనిట్ల వరకు ఉచిత వంట గ్యాస్ పంపిణీ, రైతుల రుణమాఫీ, రైతు భరోసా, తదితర పథకాలను అమలు చేశామని తెలిపారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, భువనగిరి నియోజకవర్గ కోఆర్డీనేటర్స్ ధనవంతి, డాక్టర్ పులి అనిల్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తీ, తంగళ్లపల్లి రవికుమార్, మంగ ప్రవీణ్, ఎలిమినేటి కృష్ణారెడ్డి, బర్రె జహంగీర్, కూర వెంకటేష్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, శ్యామ్ గౌడ్, సత్తిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

ఎమ్మెల్యే సామేలుకు మంత్రి పదవి ఇవ్వాలి

మోత్కూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మందుల సామేలుకు మంత్రివర్గ విస్తరణలో మంత్రిగా అవకాశం కల్పించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు కూరెల్ల శ్రీరాములు కోరారు. బుధవారం మోత్కూరు గాంధీనగర్‌లో జరిగిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలు సామేలును నియోజక వర్గ చరిత్రలోనే 51వేల ఓట్ల రికార్డు మెజార్టీతో గెలిపించారంటే ఆయనపై ప్రజలకు ఎంత అభిమానం ఉందో కాంగ్రెస్ అధిష్టానం గుర్తించాలన్నారు. సమావేశంలో నాయకులు మెంట నగేష్, కూరెల్ల రాములు, మెంట యాదగిరి పాల్గొన్నారు.

ముమ్మరంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

చౌటుప్పల్ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలో రూ.4.50 కోట్ల హెచ్ఎండీఏ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మునిసిపాలిటీలోని 20 వార్డుల్లో అత్యవసరమైన వీధులను సీసీ రోడ్లుగా మార్చుతున్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని హెచ్ఎండీఏ నుంచి రూ. 4.50 కోట్లను విడుదల చేయించడంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి.

మునిసిపల్ మాజీ చైర్మన్ పరిశీలన : పట్టణంలోని 12వ వార్డులో సుమారు 400 మీటర్ల పొడవున జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం మునిసిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో హెచ్ఎండీఏ నుంచి మరిన్ని నిధులను మంజూరు చేయిస్తానని, అవసరం ఉన్న ప్రతీ వీధిని సీసీ రోడ్డుగా మార్చుతామని రాజు తెలిపారు.

పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలి

భువనగిరి రూరల్, మే28(ఆంధ్రజ్యోతి): మండలంలోని హన్మాపురంలో దళితులు సేద్యం చేసుకుంటున్న ప్రభుత్వ భూమికి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం భువనగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట దళిత రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హన్మాపురంలో ప్రభుత్వ భూమిని గత 70సంవత్సరాలుగా 14 దళిత కుటుంబాలు సాగుచేసుకుంటున్నాయన్నారు. అనంతరం తహసీల్దార్ ఎన్ అంజిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. నాయకులు దయ్యాల నర్సింహ, పల్లెర్ల అంజయ్య, బాలరాజు, పరమేశ్, బాలనర్సింహ పాల్గొన్నారు.

'స్థానిక' పోరుకు సన్నాహాలు

(5వ పేజీ తరువాయి)

నేతలకే ఎన్నికల్లో అవకాశం కల్పించాలని, క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్‌లో అందుబాటులో ఉన్నవారికే ప్రాధాన్యం ఇవ్వాలని యోచిస్తోంది. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అభ్యర్థుల ఎంపిక పీసీసీ పరిశీలకుల బాధ్యత అత్యంత కీలకంగా మారనుంది.

సత్తా చాటాలని.. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటి మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవాలని ప్రతిపక్షాలు సన్నద్ధమవుతున్నాయి. అధికార పార్టీకి దీటుగా గ్రామాలు, పట్టణాల్లో పలు ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నాయి. బీఆర్ఎస్ రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లతోపాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, అమలుతీరుపై సమీక్షలు చేస్తోంది. ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం చేయలేకపోయిన పనులను నిలదీస్తూ, పూర్వవైభవాన్ని చాటుకోవాలని ప్రయత్నాలు ముమ్మరంగా చేసింది. వారం రోజుల్లోగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పుంజుకుంది. ఆ హవాను కొనసాగిస్తూ ఈసారి జిల్లా వ్యాప్తంగా పార్టీని విస్తరిస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సంఖ్యలో సీట్లు గెలుచుకునేందుకు సన్నద్ధమవుతోంది. జిల్లాలోని వామపక్షాలు, ఇతర పార్టీలు సత్తా చాటేందుకు ప్రయత్నిస్తున్నాయి

ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి

చౌటుప్పల్ టౌన్, చౌటుప్పల్ రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు భారత రత్న ప్రకటించాలని టీడీపీ సంస్థాగత జిల్లా ఎన్నికల పరిశీలకుడు గుమ్మడి అంజిరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. చౌటుప్పల్ పట్టణంలోని బీమిడి మోహన్ రెడ్డి భవన్‌లో టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం ఎన్టీ రామారావు 102 వ జయంతి నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఆయన విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. తెలుగుజాతికి ప్రపంచ గుర్తింపు తెచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని వారు కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వర్కాల వెంకటేశం, నల్ల పర్వతాలు, ముత్యాల పాపిరెడ్డి, మారగోని అశోక్ గౌడ్, చిలువేరు రాజు, జి. కృష్ణ తేజ, తడక కోటేశ్వర్, పాశం రఘుపతి, నూనె వెంకటేశం, ఎస్. సురేందర్ రెడ్డి, గణేష్, చెరుకు అశోక్, కంచర్ల మారయ్య, టి. శ్రీను, వి. ఉపేంద్ర చారి, జాజుల శ్రీనివాస్, ఎం. అంజయ్య, మహేష్ పాల్గొన్నారు. చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు దేప శ్యాంసుందర్ ముదిరాజు, పబ్బు శ్రీనివాస్, సిల్వేరు భిక్షపతి, భద్రయ్య, సాయి పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అవ్వారి సుబ్బారావు, నాయకులు గుమ్మడి అంజిరెడ్డి, గోసికొండ వెంకటేశం, శ్రీపతి రామ్ రెడ్డి, మైల గోపాల్ రెడ్డి, కోలను వేణుగోపాల్ రెడ్డి, కుందారపు యాదయ్య, కాటేపల్లి వెంకటేశం, బొడ్డుపల్లి అంజయ్య, జగదీష్, వావిళ్ళ సత్తయ్య, ముత్యాల భిక్షపతి, మల్లారెడ్డి,కడ్తల స్వామి పాల్గొన్నారు.



చౌటుప్పల్‌లో కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు

యాదగిరిగుట్ట రూరల్: పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ ఆలేరు నియోజకవర్గం కో కన్వీనర్ రేగు బాలనర్సయ్య, టీడీపీ నాయకులు మచ్చ నర్సింహగౌడ్, కళ్లెం బాబురావు, చిత్తర్ల శ్రీనివాస్‌గౌడ్, ముక్కెర్ల శ్రీశైలం యాదవ్, గుండా భాస్కర్, సీస రాజ్ కుమార్‌గౌడ్, బండకింది కృష్ణ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, బడుగు దానయ్య, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మీసాల నర్సింహ, నాయకులు భైరు లక్ష్మయ్య, నార్ల రాజుయాదవ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు బేతాళ బాలనర్సింహ, శాదం కిష్టయ్య, దాసరి బాల్‌రెడ్డి, వీరేశం, బాలయ్య, కృష్ణాచారి, బొందయ్య, నరసింహ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండలకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బాలనర్సయ్య, నాయకులు బొబ్బల పద్మారెడ్డి, గుండా భాస్కర్, మచ్చ నర్సింహ్మ, ముక్కర్ల శ్రీశైలం, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆలేరు: పట్టణంలో టీడీపీ మండల అధ్యక్షుడు మల్‌రెడ్డి సాంబిరెడ్డి, నాయకులు సంతోష్‌కుమార్, నర్సింహులు, వెంకటేశ్ పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు ఉచితంగా పంపిణీ చేయాలి

మోత్కూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా నట్టల నివారణ మందు పంపిణీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి మద్దెపురం రాజు డిమాండ్ చేశారు. బుధవారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది మందల వద్దకు వెళ్లి జీవాలకు నట్టల నివారణ మందు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉందన్న సాకుతో ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల నుంచి ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు.

అదనపు అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి

భువనగిరి టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): భువనగిరి 30వ వార్డులో అదనపు అంగన్వాడీ కేంద్రం నాయకుడు ఎండీ లయాక్ అహ్మద్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఐసీడీసీ సీడీపీఓ శైలజకు వినతిపత్రం అందజేశారు. పెరిగిన జనాభాతో పిల్లల సంఖ్య కూడా పెరిగింది. దీంతో ప్రస్తుతం ఉన్న అంగన్వాడీ కేంద్రం ద్వారా లబ్ధిదారులకు సకాలంలో పూర్తిస్థాయి సేవలు అందడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు.

పచ్చిరొట్టతో భూమికి అధిక పోషకాలు

- పంటమార్పిడి విధానాన్ని తప్పనిసరిగా పాటించాలి
- ఆచార్య జయశంకర్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు

తుర్కపల్లి, మే 28(ఆంధ్రజ్యోతి): వరి సాగుకు ముందు పొలంలో పచ్చిరొట్ట పైర్ల పెంపకాన్ని చేపట్టి తక్కువ ఖర్చుతో భూమికి అధిక పోషకాలు అందించవచ్చని ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ అరుణ, డాక్టర్ అనీల, ఇందుధర్‌రెడ్డి అన్నారు. తుర్కపల్లి మండలం కొనాపూర్, చిన్నలక్ష్మాపూర్ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన రైతు ముంగిట్లో - శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ రైతు తమ పొలంలో పచ్చిరొట్ట ఎరువుగా జీలుగ, జనుము, పిల్లిపెసర, పెసర, మినుములు వంటి పైర్ల పెంపకాన్ని చేపట్టాలని, 45 రోజుల తర్వాత కలియదున్నడం వల్ల భూమికి అధిక పోషకాలు లభిస్తాయని అన్నారు. ప్రధానంగా యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. పంట దిగుబడి రావాలని అధిక రసాయన ఎరువులు వాడితే పంట చేళ్లతో పాటు నేల దెబ్బ తింటుందని అన్నారు. పంట మార్పిడి విధానాన్ని రైతులు తప్పకుండా పాటించినట్లైతే భూమిలో భూ సారం పెరుగుతుందన్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో పాటు వరి కంకి దశలో పై పాటు ఎరువుగా పొటాష్‌ను వాడినట్లైతే తాలు గింజ రాదని, అంతే కాకుండా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. కాంప్లెక్స్ ఎరువులను అడుగు మందులుగా వాడాలన్నారు. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు అరికట్టడానికి ప్రభుత్వంతో గుర్తింపు పొందిన షాపుల్లోనే కొనుగోలుచేసి, తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. సదస్సులో భూగర్భ జలాల ప్రాముఖ్యం, వినియోగం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ప్రసూన, ఏఈవోలు కే.పృథ్వీరాజ్, కే.రాకేష్ పాల్గొన్నారు.



తుర్కపల్లి: కోనాపూర్‌లో కరపత్రాలను విడుదల చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఆరుతడి పంటలతో అధిక లాభాలు

మోటకొండూరు : రైతులు వరి విస్తీర్ణం తగ్గించి ఆరుతడి పంటల సాగు పెంచాలని యాదగిరిగుట్ట ఏడీఏ శాంతినిర్మల అన్నారు. మండల కేంద్రంలో ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బిందు సేద్యం ద్వారా నీటి ఆదాతో అధిక దిగుబడి సాధ్యమన్నారు. రైతులు సాగునీటిని ఆదా చేసి భావితరాలకు అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్త అనిల్ కుమార్, ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన, విస్తరణ సంఘం సభ్యుడు మంతపురి యాదగిరి, పశువైద్యాధికారి సంతోష్, మండల వ్యవసాయధికారి రమాదేవి, రాజా, మధుశేఖర్, సురేష్, ఏఈఓ శివాని, వెంకటేష్, రైతులు కంచి మల్లయ్య, సిద్దారెడ్డి పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పని సరి

బొమ్మలరామారం: రైతులు దుక్కి దున్నే ముందు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ శకుంతల దేవి అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఫకీర్‌గూడెం, జలాల్‌పూర్, కాజిపేట గ్రామాలలో రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీపూజ, డాక్టర్ భారతి, డాక్టర్ తేజస్వి, మండల వ్యవసాయ అధికారులు వెంకటేశ్వర్లు, మౌనికతో పాటు వివిధ గ్రామాల రైతులు హాజరయ్యారు.

పని ప్రదేశంలో నీడ, తాగునీటి వసతి కల్పించాలి



హన్మాపురంలో ఉపాధి కూలీల సమావేశంలో మాట్లాడుతున్న అంజయ్య

తుర్కపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కార్మికులకు పని ప్రదేశంలో నీడ, తాగునీటి వసతి, మెడికల్ కిట్లు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ డిమాండ్ చేశారు. తుర్కపల్లి మండల కేంద్రంలో బుధవారం ఉపాధి కూలీలు చేపడుతున్న పని ప్రదేశాన్ని పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీల సమస్యల పరిష్కారానికి ఈ నెల 30న ఉపాధి హామీ పథకం పరిరక్షణ కోసం కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పోతరాజు జహంగీర్, వ్యకాస మండల అధ్యక్షుడు తలారి మాతయ్య పాల్గొన్నారు.

అడ్డగూడూరు: కలెక్టరేట్ ఎదుట ఈనెల 30న నిర్వహించనున్న ధర్నాలో ఉపాధి హామీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు బొల్లు యాదగిరి, జిల్లా కమిటీ సభ్యులు వళ్లంభట్ల శ్రీనివాస్‌రావు కోరారు. బుధవారం అడ్డగూడూరు మండల కేంద్రంతో పాటు గోవిందాపురం, బొడ్డుగూడెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యకమంలో సంఘం నాయకులు, ఉపాధి కార్మికులు టీ. బాలామ్మ, స్వరుప, వెంకటయ్య, మల్లయ్య, ఐలమ్మ, ఉపేంద్ర, బిక్షమ్మయ్య పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: మండలంలోని హన్మాపురం గ్రామంలో ఉపాధి కూలీల పని ప్రదేశంలో జరిగిన సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లెర్ల అంజయ్య మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దయ్యాల లక్ష్మీ పాల్గొన్నారు.